క్లుప్తంగా

చర్చి అక్రమ నిర్మాణాన్ని ఆపాలి



మునిసిపల్ ఆఫీస్‌లో ఫిర్యాదు అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నేతలు

వర్ధన్నపేట : పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా చర్చి అక్రమ నిర్మాణం చేస్తున్నారని దీనిని వెంటనే ఆపాలని కోరుతూ శనివారం మునిసిపల్ కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం.. వర్ధన్నపేట నుంచి జఫర్‌గడ్ వెళ్లే రహదారిలోని పిర్గిగడ్డ ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మాణం చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా 2వ వార్డులో సమాధి నిర్మించి వార్డు ప్రజలను ఇబ్బందికి గురి చేశారని గుర్తు చేశారు. ప్రజల్లో మత కలహాలు సృష్టించే వారిపై చర్యలు తీసుకుని శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరారు.

ఘనంగా బండా ప్రకాశ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మొగిలి తదితరులు

దుగ్గొండి : శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ జన్మదిన వేడుకలను మండలంలోని గిర్నిబావిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ఎన్ఆర్ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పల్లె రమేశ్, మెపా మండల అధ్యక్షుడు ఓరుగంటి తిరుపతి, ముత్యాల స్వామి, సార రాములు, బీసీ జాక్ కన్వీనర్ బండారి ప్రకాశ్, రాజేందర్, మురళి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్, స్థానిక ఎన్నికల కమిటీ నియామకం

వర్ధన్నపేట : వర్ధన్నపేట మండల, మునిసిపల్ స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కమిటీలో సభ్యులుగా మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఎండీ. చోటే వలీ, పత్రి భానుప్రసాద్ నియామకమయ్యారు. పట్టణ కమిటీ సభ్యులుగా ఎద్దు సత్యనారాయణ, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, నరుకుడు వెంకటయ్య, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మైస సురేశ్‌లను నియమించినట్లు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్

పర్వతగిరి : పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు కారుపోతుల శ్రీనివాస్ కోరారు. మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ స్కూల్‌లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పేరెంట్స్ కమిటీని అభినందించి మాట్లాడుతూ పేరెంట్స్ కమిటీ బాధ్యులు పాఠశాల అభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణు, ప్రముజావాలా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లను అపహరించిన దొంగలు

గీసుకొండ : మండలంలోని మనుగొండలో ఓ రైతు తన వ్యవసాయ బావి వద్ద రేకుల షెడ్డులో పెంచుకుంటున్న కోళ్లను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు స్థానిక సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మనుగొండకు చెందిన బొత్స యాదగిరి తన వ్యవసాయ బావి వద్ద షెడ్‌ను ఏర్పాటు చేసి 50 కోళ్లను పెంచుతుండగా వాటిని దొంగలు ఎత్తుకుని వెళ్లారు. శనివారం ఉదయం రైతు బావి వద్దకు వెళ్లి చూడగా కోళ్లు కనిపించకపోవడంతో తమకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నందీశ్వరుడికి అభిషేకం

ఐనవోలు : బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం ప్రదోషకాలంలో నందీశ్వరుడికి అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు.



నర్సంపేట : పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు



పర్వతగిరి : బంద్‌లో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు



నల్లబెల్లి : రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

బీసీ బంద్ విజయవంతం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ చేపట్టిన తెలంగాణ బీసీ బంద్ శనివారం జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, వామపక్ష విద్యార్థి సంఘాలు, తెలంగాణ జనసమితి, బీసీ రాజ్యాధికార సమితి, బీజేపీ, స్వచ్ఛంద సంస్థలు, పద్మశాలీల ఆధ్వర్యంలో వేర్వేరుగా బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీలు చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగులు బంద్‌కు మద్దతు తెలిపారు. ప్రధాన రహదారుల్లో రాస్తారోకో సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎవరిపై ఈ పోరాటం..

గిర్నిబావిలో ప్రధాన రహదారిపై వివిధ రాజకీయ పార్టీలు వేర్వేరుగా రాస్తారోకోలు చేపట్టడంతో పలువురు ప్రయాణికులు వారి వద్దకు వెళ్లి అన్నీ రాజకీయ పార్టీలు ధర్నాలు చేస్తున్నారు. పరిష్కారం ఎవరూ చేయాలి. ఎవరు ఎవరిపై పోరాటం చేస్తున్నారంటూ బీజేపీ, కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది – సాక్షి, నెట్‌వర్క్



నర్సంపేట : పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి : బంద్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు, కార్యకర్తలు



దుగ్గొండి: గిర్నిబావిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నెక్కొండ : బీసీ బంద్‌లో పాల్గొని మాట్లాడుతున్న నాయకులు



రాయపర్తి : షాపులను మూసివేస్తున్న ఎంసీపీఐ(యూ), ఎమ్మార్పీఎస్ నాయకులు



నల్లబెల్లి : తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేటలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేట : ఎంసీపీఐ(యూ), బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ



నర్సంపేట : పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు



ఖానాపురం : రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



సంగెం : బంద్‌లో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

రోటరీక్లబ్ సేవలు అభినందనీయం

నల్లబెల్లి: పాఠశాలల బలోపేతంలో భాగంగా రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని హెచ్‌ఎం సుధాకర్ రావు అన్నారు. హనుమకొండ రోటరీ క్లబ్ సహకారంతో మండలంలోని నారక్కపేట హైస్కూల్‌కు శనివారం డ్యూయల్ డెస్క్ బెంచీలు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు దాతలు అందిస్తున్న వసతులను సద్వినియోగించుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని కోరారు. పాఠశాల వాటాధనాన్ని ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా అందించారు. భవిష్యత్‌లో రోటరీ క్లబ్ సహకారంతో పాఠశాల విద్యార్థినులకు సైకిల్స్ పంపిణీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామోదర్, నీలిమ, సుధాకర్, ఆశాసుల్తాన, వినోద, రాజు, మహిపాల్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం సుధాకర్‌రావు

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

ఐనవోలు : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని, సామాజిక ఐక్యతకు ప్రతీకలని, గ్రామస్తులందరూ సమిష్టిగా ఐకమత్యంతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శనివారం ఐనవోలు మండలం కక్కిరాలపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధర్మకర్తల మండలి పదవీ, గోప్యత ప్రమాణస్వీకారం ఈఓ కందుల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరు కాగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఈఓ సుధాకర్ సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, కాటబోయిన కుమారస్వామి, భిక్షపతి, రజితతో పాటు ఎక్స్ అఫీషియోగా అర్చకుడు పరాశరం జయకృష్ణమాచార్యను పదవీ, గోప్యత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్‌గా పబ్బతి సత్యనారాయణను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

నెక్కొండ: ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులు, ప్రజలకు అవగాహన అవసరమని ఎఫ్ఎస్‌సీ కౌన్సిలర్ ఎం.ప్రేమ్‌కుమార్ అన్నారు. మండలంలోని సాయిరెడ్డిపల్లి, రెడ్లవాడ గ్రామాల్లో శనివారం తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఖాతాదారుడు జన సురక్ష పథకాలు తెలుసుకొని అర్హత ఉన్న పథకంలో చేరాలన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంలో చేరేందుకు 18 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్న వారందరూ అర్హులని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో చేరేందుకు 18 నుంచి 70 ఏళ్ల వయస్సు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఈ పథకాలతో వచ్చే ప్రయోజనాలను ఆయన వివరించారు. అలాగే అపరిచిత వ్యక్తులు చేసే మోసాపూరిత కాల్స్‌కు స్పందించి ఖాతా, ఏటీఎం, ఓటీపీ, సీవీవీ నంబరు సమాచారం ఇవ్వొద్దని ఆయన కోరారు. సమావేశంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కిషన్‌కుమార్ సింగ్, బి.చిన్ననాయుడు పాల్గొన్నారు.

ఖోఖో కోచింగ్ క్యాంప్ ప్రారంభం

నర్సంపేట రూరల్ : మండలంలోని మహేశ్వరం శివారులోని శివాని పబ్లిక్ స్కూల్‌లో శనివారం జాతీయస్థాయి ఖోఖో కోచింగ్ క్యాంప్‌ను స్థానిక ఎంఈఓ కొర్ర సారయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఈ కోచింగ్ క్యాంప్‌లో 20 మంది మహిళలు, 20 మంది పురుషులు పాల్గొన్నారని, శనివారం నుంచి ఈనెల 22 వరకు కోచింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 24 నుంచి 26 వరకు బెంగళూర్‌లో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కోచింగ్ విద్యార్థులకు భోజనం, వసతి సదుపాయాలు శివాని పబ్లిక్ యాజమాన్యం గొల్లపూడి సుబ్బారావు, రాహుల్, ప్రిన్సిపాల్ సురేందర్‌లు కల్పించారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌చార్జ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు స్వప్న, కోట రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలిసి పాల్గొన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ మొగిలిచర్ల శివారులోని క్రికెట్ మైదానంలో శనివారం నుంచి అక్కంపేట క్రికెట్ లీగ్ సీజన్-5 పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మనుగొండకు చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకులు, సామాజిక సేవకుడు అల్లం బాలకిషోర్‌రెడ్డి రూ. 46 వేల విలువైన క్రీడా దుస్తులను సొంత ఖర్చులతో అందించారు. ఆయన అందించిన దుస్తులను కాంగ్రెస్ నాయకులు అల్లం మర్రెడ్డి క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు రేగుల రాజు, కందకట్ల రాజేందర్, వాసవి నరేశ్, రాయరాకుల శ్రీకాంత్, నాయకులు కందికొండ రాజ్‌కుమార్, తుప్పరి ఉదయ్, పలు జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట : ఆగమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

నర్సంపేట : పట్టణానికి చెందిన వనపర్తి కల్యాణ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లకొండ శ్రీను, ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు బానోత్ రమేశ్, చిలువేరు అన్వేశ్, భవానిశంకర్, తదితరులు ఉన్నారు. అలాగే నర్సంపేటకు చెందిన వేముల ఆగమ్మ శనివారం మృతి చెందగా గౌడ సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లుగౌడ్, వేముల గౌడ ప్రారంభ సంఘం అధ్యక్షుడు ఆయిల్ సమ్మయ్యగౌడ్, మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఆర్టీసీ జేఏసీ ప్రెసిడెంట్ వేముల రవిగౌడ్‌లు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సారంగంగౌడ్, కంగిరేణిగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, కృష్ణప్రసాద్‌గౌడ్, గోపి, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

రాయపర్తి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మండలకేంద్రానికి చెందిన ఎండీ.గౌస్‌పాషా కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో బియ్యంతో పాటు, ఆయిల్‌క్యాన్‌ను అందించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు గజవెల్లి ప్రసాద్, ఎండీ యూసుఫ్ తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలతో సీఐ శ్రీనివాస్, ఎస్సై సాయిబాబు

వర్ధన్నపేట: యువత క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎదగాలని స్థానిక సీఐ శ్రీనివాస్‌రావు, మేరా యువభారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్ ఆకాంక్షించారు. వర్ధన్నపేట బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ క్రీడలు శనివారం ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువత ఎంతో కీలకమన్నారు. క్రీడలతో పాటు అన్ని రంగాల్లో ఎదిగి దేశ ప్రతిష్టను ఇనుమడింపచేయాలని పిలుపునిచ్చారు. క్రీడలతో మానసిక వికాసం, ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈవెంట్స్‌లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. మిగతా పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందచేశారు. ఎస్సై సాయిబాబు, నిర్వహకులు దేవిలాల్, సాంఘీక సంక్షేమ శాఖ అధ్యాపకులు స్రవంతి, పూర్ణమ్మ, పీఈటీలు జ్యోత్స్న, శ్రీనివాస్, అరుణ పాల్గొన్నారు.